❖•❖•❖ 32 ❖•❖•❖

# కలువరి గిరి దారిలో

*"ఆయనను అపహసించిన తరువాత ఆయన మీదనున్న ఆ అంగీని తీసివేసి ఆయన వస్త్రములాయనకు తొడిగించి, సిలువ వేయుటకు ఆయనను తీసికొనిపోయిరి" (మత్తయి 27:31).*

మనము చారిత్రాత్మకమైన యేసు తీర్పుల గూర్చిన నివేదికల ముగింపుకు వచ్చాము. పిలాతు గబ్బతాలో ఉండిన గద్దె మీది నుండి, యేసు కేసుకు సంబంధించిన తన తుది తీర్పును ప్రకటించాడు; కానీ ఆయన తీర్పులో ఎలాంటి నైతిక నిజాయితీ లేకుండెను. వ్యక్తిగత మరియు రాజకీయ ఒత్తిడులకు గురై, ఆయన యూదుల మహా సభ ఇష్టమునకు లొంగిపోయాడు. "యేసును వారికిష్టము వచ్చినట్లు చేయుటకు అప్పగించెను" అని లూకా ఈ ప్రభుత్వాధికారి గూర్చి వ్రాస్తున్నాడు (లూకా 23:25బి).

సిలువవేయబడుటకు మునుపు చేయవలసిన ఒక వాడుకయై యున్నట్లుగా, అప్పటికే యేసు కొరడాలతో కొట్టబడ్డాడు (యోహాను 19:1). ఇక సిలువ వేయుటకు మిగిలిందెల్లా మ్రానుతో చేయబడిన సిలువను మరియు యితర వస్తుసామగ్రిని పోగుచేసుకొని ఖైదీ సిలువవేయబడాల్సిన స్థలమునకు వానిని తీసికొని వెళ్లుటకు ఊరేగింపును నిర్వహించుట. చివరి నిమిషంలోని వివరాలు సిద్ధం చేయబడుచుండగా, యేసు సైనికుల చేత పరిహసింపబడి ఆయన అనుభవించనై యుండిన ఊహింపశక్యముకాని మరణమును ఎదుర్కొనుటకు ఆయన స్వంత వస్త్రములు తొడిగించబడ్డాడు. "ఆయనను అపహసించిన తరువాత ... ఆయన వస్త్రములాయనకు తొడిగించి, సిలువ వేయుటకు ఆయనను తీసికొనిపోయిరి" అని మత్తయి చెప్పుచున్నాడు (మత్తయి 27:31).

యేసుతో కూడ సిలువవేయబడుటకు నిర్బంధంలో ఉంచబడినవారు దొంగలై యుండిరి. రోమా సేనా భాగము – ఒక శతాధిపతి అధికారము క్రింద ఉండిన నలుగురు సైనికులు

– ఎంతమందినైనా ఒక్క వ్యక్తినే ఉరితీసినంత సులభంగా ఉరితీయగలుగు చుండిరి, గనుక ఈ ఇద్దరు కూడ ప్రస్తుత ఊరేగింపునకు చేర్చబడ్డారు. "మరి యిద్దరు ఆయనతో కూడ చంపబడుటకు తేబడిరి; వారు నేరము చేసినవారు" అని లూకా వ్రాస్తున్నాడు (లూకా 23:32). ఈ సంఘటనకు యింకా యిద్దరిని కలుపుట ద్వారా, వారు యెషయా వ్రాసిన ఒక ప్రవచనమును నెరవేర్చుచుండిరని అధికారికంగా జవాబుదారులైనవారు కొంచెమైనా గ్రహించలేదు (యెషయా 53:9).

ఖైదీలు మరియు రోమా సైనికుల కవాతు యెరూషలేము వీధుల గుండా సాగివెళ్లుచు నగర ద్వారములలో ఒక దాని గుండా బయటికి వెళ్లి, గవినికి కొంత దూరంలో ఒక చోట నిలిచిపోయింది (హెబ్రీయులకు 13:12). ఆ స్థలము "కపాలము" లేక, హెబ్రీ లేదా అరమెయిక్ భాషలో "గొల్గొతా" అని పిలువబడింది (యోహాను 19:17). ఇది "కపాలము" అని అర్థమిచ్చు లాటిన్ భాషలోని *calvaria* (కల్వరియా) అను పదము నుండి వచ్చిన "కల్వరీ" అని కూడా పిలువబడింది (లూకా 23:33; KJV). ఆ ఊరేగింపు వెళ్ళిన దారికి *Via Dolorosa* (వయాడోలొరోసా) అని పేరు పెట్టబడింది, ఈ లాటిన్ భాషా పదమునకు "బాధల బాట" అని అర్థము. అది పస్కా పండుగ సమయమైనందు వలన, యెరూషలేము మొదలుకొని సుదూర ప్రాంతముల నుండి వచ్చిన ప్రజల చేత నిస్సందేహముగా వీధులు నిండిపోయాయి. వీరిలో కొందరు యేసు మరణించాల్సిందేనను వారి ఒప్పింపును వ్యక్తము చేయుట ద్వారా, ఇతరులు కేవలము తీర్పు ఎలా వస్తుందోనను జిజ్ఞాస కలిగియుండుట ద్వారా మరియు జరుగుచున్నదేమిటో చూడాలని అక్కడికి చేరుకొనుట ద్వారా యేసు తీర్పులలో పాల్గొన్నారు.

రోమా పద్ధతి ప్రకారము, నేరస్తులు ఎవరి సిలువను వారు సిలువవేయబడు స్థలము వరకు వారి భుజములపై మోయునట్లు బలవంతము చేయబడ్డారు. "ఆయన తన సిలువ మోసికొని, కపాలస్థలమను చోటికి వెళ్లెను" అని యోహాను యేసు గూర్చి వ్రాయుచున్నాడు (యోహాను 19:17). కొరడా చేత కొట్టబడిన దెబ్బల వలనను సహించిన సేదదీరని రాత్రి వలనను తనలోని సత్తువనంతా కోల్పోయి, యేసు భారమైన ఆ సిలువ మ్రానును మోయుటకు ఎంతో ప్రయాసపడ్డాడు. అది సహేతుకమైన భావనయే అయినా, యేసు సిలువ భారమునుబట్టి నేలకు ఒరిగిపోయాడని సువార్తల రచయితలు వ్రాయలేదు. ఊరేగింపు ముందుకు వెళ్లుచుండగా, యేసుకు సహాయము అవసరమై యున్నదని సిలువ మరణమును అమలు చేయుచుండిన రోమా సైనికులకు స్పష్టంగా అర్థమయ్యింది. "కురేనీయుడైన సీమోనను ఒకడు పల్లెటూరినుండి వచ్చి ఆ మార్గమున పోవుచుండగా, ఆయన సిలువను మోయుటకు అతనిని బలవంతము చేసిరి. అతడు అలెక్సంద్రునకును రూపునకును తండ్రి" అని మార్కు చెప్పుచున్నాడు (మార్కు 15:21, 22ఎ). రోమా సైనికులు, అవసరమైనప్పుడెల్లా, సిలువను మోయుటలో అవసరమైన విధంగా తోడ్పడుటకు దారినపోయే దానయ్య(ల)ను ఎవరినైనా శాసించు అధికారము కలిగియుండిరి "వారాయనను తీసికొనిపోవుచుండాగా పల్లెటూరినుండి వచ్చుచున్న కురేనీయుడైన సీమోనను ఒకని పట్టుకొని, యేసు వెంట సిలువను మోయుటకు అతనిమీద దానిని పెట్టిరి" అని లూకా చెప్పుచున్నాడు (లూకా 23:26). రోమా సైనికుడొకడు సీమోను వైపు చూస్తూ, "ఓయ్, నీవే, ఇటు రా, ఈ మనుష్యుని సిలువను మోయు" అని చెప్పియుంటాడు. యేసుతో కూడా సిలువను మోయుచుండిన సీమోను యేసు వెనుక కలువరి గిరి వరకు వెళ్లాడు.

కలువరి గిరి మార్గములో ఒక చోట, యేసు ఒక ప్రక్కకు తిరిగి ఆయనను వెంబడించుచుండిన స్త్రీలతో మాట్లాడాడు. ఆయన ఈ స్త్రీలకు తెలియజెప్పిన ఉద్బోధ యేసు గబ్బతాకును గొల్గొతాకును మధ్య మాటలాడాడని వ్రాయబడిన ఒకే ఒక సందర్భమై యున్నది. ఆ స్త్రీలు ఆయన నిమిత్తము రొమ్ముకొట్టుకొనుచు యేడ్చుచుండిరి. ఈ స్త్రీల గూర్చి మనకు మరిన్ని వివరాలు తెలియవు. ఇటువంటి సందర్భములలో ఏడ్చుట వారి వృత్తి అయియుండవచ్చును, గనుక యేసుతో కూడా ఆయన వెనుక నడుచుచు, బహిరంగముగా ఆయన నిమిత్తము యేడ్చుటకు ఈ ఊరేగింపులో వారంతట వారే చేరియుండవచ్చును. వారు యేడ్చుట విని, యేసు ఆగిపోయి, వారి పైపు తిరిగి, వారితో ఇలా మాట్లాడుచున్నాడు:

> యెరూషలేము కుమార్తెలారా, నా నిమిత్తము ఏడ్వకుడి; మీ నిమిత్తమును మీ పిల్లల నిమిత్తము ఏడ్వుడి. ఇదిగో – "గొడ్రాండ్రును కనని గర్భములును పాలియ్యని స్తనములును ధన్యములైనవని చెప్పుదినములు వచ్చుచున్నవి" అప్పుడు – "మామీద పడుడని" పర్వతములతోను, "మమ్ము కప్పుడని" కొండలతోను జనులు చెప్పసాగుదురు. వారు పచ్చి మ్రానుకే యిలాగు చేసినయెడల ఎండిన దానికేమి చేయుదురో (లూకా 23:28–31).

యేసు స్త్రీలతో ఈ మాటలు పలికిన కొద్ది సేపటికి, ఊరేగింపు యేసు మరియు ఇద్దరు దొంగలు సిలువవేయబడవలసిన చోటికి చేరుకొన్నది. ప్రేతోర్యము నుండి కలువరి గిరి వరకు సాగిన ప్రయాణం ఎంతో దూరం కాదు; అర్ధ మైలు కంటె ఎక్కువ దూరము ఉండకపోవచ్చును. ఏదిఏమైనా, కొరడా దెబ్బలు కొట్టబడినవాడును, 24 గంటలు నిద్ర, ఆహారం, త్రాగుటకు నీళ్లు దొరకనివాడునైన, యేసుకు, ప్రతి అడుగు చిత్రహింస పెట్టుచున్నదై, తన శరీరం కూడగట్టుకొనగల శక్తి అంతా అణువణువునా అవసరమై యుండినది.

మన ప్రభువు యొక్క మరణములోని ప్రతి అంశము మన కొరకు ప్రాముఖ్యతను మరియు అర్థమును కలిగియున్నది. ప్రతి భాగం మన హృదయయాలపై మనమెన్నడును మరువకూడని పాఠములను చెరగని ముద్రగా వేయును. సిలువ యొద్దకు సాగిన ఈ ప్రయాణం ఒక మినహాయింపు కాదు. అది మనకేమి బోధిస్తున్నది?

*కురేనీయుడైన సీమోను యేసును ఎదుర్కొనుట గూర్చిన విషయము మనకొక ముఖ్యమైన దృష్టాంతము నిచ్చుచున్నది.* సీమోను, యేసుతో కూడా సిలువను మోయుటకు బలవంతము చేయబడినవాడు, ఇటువంటి సంఘటన మనము ఎన్నడూ ఎదురుచూడని సమయంలో సంభవించి, జీవితాన్ని ఎప్పటికీ మార్చివేయగలదను వాస్తవమును మనకు విపులంగా చూపిస్తున్నాడు. ఆ రోజు ఉదయం, సీమోను యెరూషలేములోనికి పరదేశము నుండి వచ్చిన ఎవరికి ఎరుకలేనివాడుగా ప్రవేశించాడు. వీధీ గుండా ఊరేగింపు వెళ్తూవుంటే చూచి ఏంజరుగుతుందోనని చూడవెళ్లాడు. అప్పుడు అతనిని చూచిన రోమా సైనికుడొకడు అతడు వచ్చి సిలువను మోయుటలో యేసుకు తోడ్పడవలెనని శాసించాడు. ఆ క్షణంలో, ఎక్కడో మారు మూలన ఉండిన సీమోను లేఖనములలో చోటు సంపాదించుకొన్నాడు. సువార్త ప్రకటింపబడు ప్రతి చోట, సీమోను పేరు పేర్కొనబడుతుంది. గనుక మనము కూడ ప్రతి క్షణమును ఆకాంక్షతోను నిరీక్షణతోను ఒక సదవకాశముగా స్వీకరించి మన శాయశక్తులా చేయవలెనని దీని నుండి నేర్చుకొందాము; ఏలయనగా మనము దేనికొరకును ఎదురుచూడనప్పుడు, జీవితకాలమంతా నిలిచియుండు ప్రాముఖ్యతను తెచ్చిపెట్టు క్షణమొకటి

మనకు ఎదురుపడవచ్చును.

*విలపించుచుండిన స్త్రీలు మనకొక పాతకాలంనాటి సత్యమును గుర్తుచేస్తున్నారు.* మన కళ్లకు కనబడేవన్ని నిజాలై యుండనవసరము లేదని వారు సరిక్రొత్త విధానంలో ప్రకటిస్తున్నారు. భయంకరమైన మరణమునకు దారితీయుచుండిన మార్గములో, యేసు నేరస్తులలో ఒక నేరస్తుడుగా తొట్రిల్లాడు. యేసుకు తగిన శాస్తే జరుగుతుందని ఖైదీలను వెంబడించుచుండిన వారిలో కొందరనుకొన్నారు. అగుపించుచుండిన దానంతటిని, దాని వికారమంతటిని అధిగమించిన సత్యమొకటి ఉండినది: యేసు, లోక రక్షకుడుగా, మన పాపముల కొరకు తనను తాను బలియాగము చేసికొను చోటికి వెళ్లుచుండెను. దీనికి ముందుండిన కాలము ఈ సంఘటన కొరకు ఎదురుచూచింది, కాని దీని తదుపరి కాలము జరిగిన సంఘటనను నెమరువేసుకొనుటకు చూస్తుంది. ఆయన సిలువను సహించి అవమానమునే అవమానపర్చాడు. ఇక, ఆయన పునరుత్థానము తరువాత, దేవుని సింహాసనము యొక్క కుడి పార్శ్వమున కూర్చుండియున్నాడు (హెబ్రీయులకు 12:2).

*దొంగలు మనలను సవాలు చేస్తున్నారు.* నశించినవాడు రక్షింపబడుటకు దాదాపుగా ప్రతి పరిస్థితి సదవకాశములను సమకూర్చునని యిద్దరు దొంగల సమక్షము గుర్తుచేయుచున్నది. ఇటువంటి నిరాశాపూరితమైన చివరి క్షణములో సహితము, యేసు పలికిన పలుకులు మరియు చేసి చూపిన క్రియలు యిద్దరు దొంగలలో ఒకనిని ఎంతో ప్రభావితం చేశాయి. అటుతరువాత, ఎవరి సిలువపై వారు మరణించుచుండగా, తన ఆధ్యాత్మిక అవసరతల గూర్చి అడిగిన వానితో యేసు మాట్లడాడు. ఆయన ప్రక్కలో మరణించుచు నిత్యజీవ నిరీక్షణ అవసరముండినవానికి కృపాసహితమైన మాటలు చెప్పుటకు మన ప్రభువు తన తుది ఊపిరిని కొంత ఉపయోగించుకొన్నాడు, గనుక వాడు యేసు వానితో చెప్పిన సత్యమును నమ్మి రక్షింపబడ్డాడు (లూకా 23:43). ఏ స్థలమేగాని, ఏ పరిస్థితేగాని – అది ఎంతటి వేదనకరమైనదైనా – దేవుని ప్రేమ వెలుగును ప్రసరింపజేయబడుటకు అవకాశములు లేకుండా లేదు. ఇద్దరు దొంగలలో ఒకడు మరణించుటకు కొన్ని క్షణముల క్రితమే క్రీస్తునంగీకరిస్తాడని ఎవరనుకొని యుంటారు?

మన ప్రభువు ప్రవర్తన ప్రభుత్వాధికారి తీర్పుకు ముందునుండి గొల్గొతా యొద్ద సిలువవేయబడువరకు సంక్షిప్తమైనదే కానీ అది సంఘటనాత్మకమైనదయ్యింది. యేసు సన్నిధిని కలిగియున్నది ఏది కూడా ఐహికమైనదై లేక "కేవలం ఎప్పటి వలెనే" అన్నట్లుండదు!

❖◆❖◆❖

*"ఆహా, మనమెంత గొప్ప ఆశ్చర్యములను సమీపించబోతున్నాము కదా (యేసు మరణమును కళ్లారా చూచుటకు మనము సిద్ధపడుచుండగా) ... లోకము ఎప్పుడైనా కళ్లారా చూచిన అత్యంత భయంతో నింపు సన్నివేశములో నుండి, శాంతితో నిండియున్న పరదైసు అక్కడికక్కడే అప్పటికప్పుడే ఆవిర్భవించినది. అత్యంత అపకీర్తి తెచ్చు శ్రమల నుండి, అత్యంత మహిమకరమైన విజయం ప్రస్ఫుటంగా కనబడుటే మనము చూచుచున్నాము; అత్యంత దారుణమైన మరణము నుండి, ఒక దైవికమైన మరియు నిత్యమూ నిలిచియుండు జీవము లేచుచున్నది."*[1]

---

సూచన

[1]F. W. Krummacher, *The Suffering Saviour* (Chicago: Moody Press, n.d.), 9.